# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 148 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 24 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ భేటీ

- క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణపై చర్చ?



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 23:** కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై జోరుగా చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మిగతా2లో...

## ఘనంగా పద్మ పురస్కారాల ప్రదానం

- పద్మభూషణ్ అందుకున్న నటుడు మమ్ముట్టి
- పద్మశ్రీలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్
- కార్యక్రమంలో ప్రధాని మోడీ తదితరుల హాజరు



2లో

## వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

ప్రభుత్వం జీవో విడుదల..చేతల ప్రభుత్వం అన్న లోకేశ్




**అమరావతి,మన జనప్రగతి జూన్ 23:** వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా ఇస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేశ్ మిగతా2లో...

## ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

### - 80కి పైగా అంశాలకు గ్రీన్ సిగ్నల్

● పరిశ్రమలు, ఐటీ,పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లకు ప్రాధాన్యం ● రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన ● ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన ● జ్యుడిషియల్ అకాడమి నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయం ● అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు





**అమరావతి,మన జనప్రగతి జూన్ 23:** ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన మిగతా2లో...

## పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం

### దక్షిణ్ ఎనర్జీ' పరిశ్రమ అగ్నిప్రమాదంలో ఇద్దరు మృతి

● ఘటనపై ఆరా తీసిన సిఎం చంద్రబాబు

● తక్షణ సహాయ చర్యలకు ఆదేశం

● డిప్యూటి సిఎం పవన్, మంత్రి లోకేశ్ తదితరుల దిగ్భ్రాంతి




**అనకాపల్లి,మన జనప్రగతి జూన్ 23:**పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం సంభవిం చింది. మంగళవారం తెల్లవారుజామున ప్లాస్టిక్ పైరోలిసిస్ ఆయిల్ తయారీ కంపెనీ దక్షిణ్ ఎనర్జీలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో పలువురు కార్మికులు ఫ్యాక్టరీలోనే చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా.. పలువురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఘటన గురించి తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుంది. మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మరోవైపు పోలీసులూ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా మిగతా2లో...



## జగన్ కబంధ హస్తాల్లో వైకాపా కాపు నేతలు

### పవన్, బాబుల మధ్య చిచ్చు పెట్టే రాజకీయం

### జగన్ కుల రాజకీయాలపై మండిపడ్డ నిమ్మల

**అమరావతి,మన జనప్రగతి జూన్ 23:** జగన్ కబంధ హస్తాల్లో వైకాపా కాపు నేతలు ఇరుక్కున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వైకాపా నేరస్థులను తయారు చేసే కర్మాగారం అని ఆరోపించారు. కూటమిలో చీలికల కోసం గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రామలక్ష్మణుల్లా ఎల్లప్పుడూ కలిసే ఉంటారని, వారి బంధం విడదీయటం ఎవరితరం కాదని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. అమరావతిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిగతా2లో...

## ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి..

● దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి ● తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయాలి ● పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోలుపై 25 శాతం పరిమితి ఎత్తివేయాలి ● మొక్కజొన్న, జొన్నలను కేంద్రం ఎంస్‌పిపై కొనుగోలు చేయాలి ● తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి వినతులు ● కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 23:**తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, మిగతా2లో...

## నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం

● హిందీ మనకు అసవరం లేదు ● తమిళం, ఇంగ్లీస్ సరిపోతుంది ● కుటుంబ పార్టీలకు తాము వ్యతిరేకం ● ప్రజలంతా తమ కుటుంబమనే భావనతో పాలన ● ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఇక్కడికి వచ్చా ● ప్రజల సంపూర్ణ మద్దతుతో అధికారం చేపట్టాం ● కరూర్ తొక్కిసలాట ఘటన మరచిపోలేని విషాదం ● అసెంబ్లీలో సిఎం విజయ్ కీలక ప్రసంగం



**చెన్నై,మన జనప్రగతి జూన్ 23:** తమిళనాడు విద్యార్థు ల్లో నీట్ అసమానతల్ని సృష్టిస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అన్నారు. అసమానతలకు కారణమైన నీట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా హిందీ మిగతా2లో...

## కాంగ్రెస్ అవినీతిపై పోరాటం చేస్తాం

● హైదరాబాద్ మెట్రో ట్రైన్ పేరుతో ● రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు? ● రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ● ఆస్తులపై సీఎం కన్ను : కేటీఆర్



**మియాపూర్, మన జనప్రగతి జూన్ 23:** కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పార్టీ నియోజవకర్గ స్థాయి కార్యకర్తల సమావేశం మియాపూర్‌లోని నేరన్ గార్డెన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైల్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపై రేవంత్ రెడ్డి కన్ను పడిందన్నారు. బీఆర్ఎస్ తరపున కార్యకర్తల మిగతా2లో...

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం



# ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం తదితర నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సా హకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయ స్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ తీసుకున్న నిర్ణ యానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకుభూముల కేటాయింపులు, బయోగ్యాస్ ఎ÷-లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశ కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల పెంపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, మెమో-57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

పరవాడలోని ఫార్మా సిటీలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మా సిటీలోని 'దక్షిణ్ ఎనర్జీ' పరిశ్రమలో జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై సంతాపం వ్యక్తం చేశారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే, ఈ ప్రమాదంలో గాయపడిన బాధితులను తక్షణమే ఆదుకోవాలని, అత్యంత మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలని వేగవంతం చేశామని అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రతను గమనించి ఫార్మా సిటీ అగ్నిమాపక కేంద్రం నుంచి రెండు, పరవాడ కేంద్రం నుంచి మరొక ఫైర్ ఇంజన్‌ను తక్షణమే ఘటనా స్థలానికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు. ఇకపోతే అగ్నిప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరోవైపు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.'దక్షిణ ఎనర్జీ కెమికల్ ఫ్యాక్టరీ'లో జరిగిన అగ్ని ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ప్రమాదంపై ఆరా తీసిన ఉపముఖ్యమంత్రి... ఇద్దరు కార్మికులు మరణించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని పవన్‌కు అధికారులు తెలియజేశారు. పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించడానికి తీసుకుంటున్న చర్యలను సమీక్షించాలని డిప్యూటీ సీఎం సూచించారు. విశాఖపట్నం పరిసర పారిశ్రామిక ప్రాంతాల్లోని అన్ని సంస్థల్లో తక్షణమే భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అగ్నిప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించారు.ఫార్మాసిటీ ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కూడా స్పందించారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందడం విషాదకరమని పేర్కొన్నారు. గాయపడిన కార్మికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాల అమలు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని తేల్చి చెప్పారు. ప్రమాదంపై పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు కూడా విచారం వ్యక్తం చేశారు. ఈ అగ్నిప్రమాదం దురదృష్టకరమని, క్షతగాత్రులకు అధికార యంత్రాంగం మెరుగైన వైద్యం అందిస్తోందని పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని.. పూర్తి వివరాలు త్వరలోనే తెలుస్తాయని అన్నారు.

# జగన్ కబంధ హస్తాల్లో వైకాపా కాపు నేతలు

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 ఓటమి నిరాశ, నిస్పృహలతో, ప్రాంతాలు, మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి చలికాచుకోవాలని గొడ్డలి పార్టీ చూస్తోందని ధ్వజమెత్తారు. సాక్షాత్తు కలియుగ దేవుడు వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని అపవిత్రం చేయాలను కుంటే.. ఆ దేవుడే వారిని మొన్నటి ఎన్నికల్లో శిక్షించారని అన్నారు. పాస్టర్ ప్రవీణ్, కడప పాస్టర్ అభినయ్‌లను అడ్డుపెట్టుకుని మతాల మధ్య చిచ్చు పెట్టాలని జగన్ అండ్ కో చూస్తే బెడిసి కొట్టిందని ఎద్దేవా చేశారు. వైసీపీ కాపు నేతలను రెచ్చగొట్టి, తప్పులు చేయించి, జైలుకు పంపి రేపు బయటకు పోలేక, జీవితాంతం జగన్ చుట్టూ ఉండేలా, ఆయన అజెండా మాత్రమే అమలు చేసేలా పులివెందుల సంస్కృతిని ఏపీలో తీసుకువస్తున్నారని ఆగ్రహించారు.శ్రీలక్ష్మి, అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్‌నాథ్ లాంటి వారితో జగన్ తప్పులు చేయించారని మంత్రి నిమ్మల మండిపడ్డారు. కొందరిని జైలుకు పంపారని, తద్వారా జగన్ ఉచ్చు లోంచి అంత త్వరగా బయటకు రాలేకపోయారని చెప్పుకొచ్చారు. నేరస్థులను తయారు చేసే కర్మాగారం గొడ్డలి పార్టీది అని వ్యంగ్యంగా అన్నారు.

బలమైన నేతలను తయారు చేసే కర్మాగారం టీడీపీది అని అభివర్ణించారు. పలువురు నేతలను పెద్దల సభకు పంపింది తెలుగుదేశం పార్టీ అని ప్రస్తావించారు. చదలవాడ, ఆదికేశవులు, పప్పల చలపతిరావు వంటి వారికి టీటీడీ చైర్మన్ పదవి ఇచ్చి టీడీపీ గౌరవించిందని వ్యాఖ్యానించారు. జగన్ అధికారంలో ఉంటే భూమన కరుణాకర్ రెడ్డి, సుబ్బారెడ్డిలకు అవకాశాలు ఇచ్చారని దుయ్యబట్టారు. బ్రిటీష్ కాలంలో ఉన్న కాపుల రిజర్వేషన్‌ను నీలం సంజీవరెడ్డి తొలగించారని తెలిపారు. దామోదరం సంజీవయ్య ఇచ్చిన కాపుల రిజర్వేషన్‌లని.. కాసు బ్రహ్మానందరెడ్డి తొలగించారని మంత్రి నిమ్మల ఆరోపించారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన ఇచా ఐదు శాతం కాపు రిజర్వేషన్‌లను జగన్ రెడ్డి రద్దు చేశారని ఆగ్రహించారు. కాపు చరిత్రలో రిజర్వేషన్లు ఇచ్చింది దామోదరం సంజీవయ్య, చంద్రబాబు మాత్రమేనని తెలిపారు. నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, జగన్ రెడ్డి కాపు రిజర్వేషన్‌లను రద్దు చేసి కాపు ద్రోహులుగా మిగిలిపోయారని విమర్శించారు. రామలక్ష్మణులా మాదిరిగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి ఉన్నంత కాలం ఎవరూ విడదీయలేరని స్పష్టం చేశారు. వైసీపీకి అధికారం రాదనే అక్కసుతో పవన్ కల్యాణ్, కాపులను జగన్ లక్ష్యము ధ్వజమెత్తారు. కులాల మధ్య అడ్డుగోడలు ఉండకూడదనే లక్ష్యంతో చంద్రబాబు పని చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి..

(మొదటి పేజీ తరువాయి)


ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ పామ్ లక్ష్యాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఔఓఇక్ష-క్షఖ కార్యక్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు.

దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచడం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆత్మనిర్భర్ భారత్, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని మంత్రులు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర విధానాన్ని అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని కోరారు.

తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి రైతులకు భరోసా కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు.

# శ్రీవాణి ట్రస్ట్ నుంచి ఆరు ఆలయాలకు నిధులు

## - అభివృద్ధికి అనుమతించిన ప్రభుత్వం



**అమరావతి,మన జనప్రగతి జూన్ 23:** తితిదే బోర్డు, శ్రీవాణి ట్రస్ట్ తీర్మానాల మేరకు ఆరు దేవాలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సికింద్రాబాద్ (శ్రీగిరి)లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.50లక్షలు, ధర్మవరం (సిద్ధయ్యగుట్ట)లోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి రూ.50.85లక్షలు, సిద్దిపేట జిల్లా దొమ్మాటలోని శ్రీమహాకాళేశ్వర ఆలయానికి రూ.4.60 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది.అనకాపల్లి జిల్లా మునగపాకలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.1.75కోట్లు, సంగారెడ్డి జిల్లాలోని కించన్‌పల్లిలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.1.09కోట్లు, కర్నూలు జిల్లా హుస్సేనాపురం లోని శ్రీసుంకులమ్మ, మారెమ్మ దేవాలయానికి రూ.1.10కోట్ల నిధులు కేటాయించేందుకు అనుమతించింది.

# రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి భవన్‌లో కలుసుకున్నారు. ఈ భేటీకి సంబంధించిన చిత్రాలను రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్ వేదికగా పంచుకుంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగవచ్చన్న ఊహాగానాలు దేశ రాజధానిలో ఊపందుకున్న వేళ ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది.కాగా, మంగళవారం ఉదయం కేరళకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జార్జి కురియన్ కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 65 ఏండ్ల కురియన్ కేంద్ర మైనారిటీ వ్యవహారాలు, మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖల సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ముర్ము ఆమోదించారు. జూన్ 21న రాజ్యసభ సభ్యత్వ పదవీకాలం పూర్తయిన కురియన్‌ను తిరిగి రాజ్యసభకు నామినేట్ చేయకూడదని బీజేపీ నిర్ణయించింది.

# ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 23:** రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు ఈ గౌరవాలను అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి. నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలంది ంచిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశా. నాటి పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వ్డడెర సోదరులు నన్ను కలిశారు. ఆనాడు నేను ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33 శాతం వాటాను వ్డడెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది' అని అన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపైట్ల వ్డడెర సంఘాల నేతలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం

(మొదటి పేజీ తరువాయి)

వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాలను ప్రస్తావించిన విజయ్ విమర్శకు లకు గట్టిగా బదులిచ్చారు. ఈ మేరకు అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. హిందీ భాషనూ వ్యతిరేకించారు. తమిళం, ఇంగ్లీష్‌లతో కూడిన ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉంటామన్నారు. నీట్ వల్ల సామాజిక అసమానతలు పెరుగు తున్నాయని సీఎం విజయ్ చెప్పుకొచ్చారు. విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి తెస్తున్న ఈ పరీక్షను రద్దుచేసి, ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య సీట్లను కేటాయించాలని తమిళనాడు చాలా కాలంగా కోరుతోందని ఆయన గుర్తుచేశారు. హిందీ భాషపైనా స్పందిస్తూ.. తమిళం రాష్ట్ర భాషగా, ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా సరిపోతాయని తన వైఖరిని స్పష్టం చేశారు. మూడో భాషను బలవంతంగా రుద్దాల్సిన అవసరం లేదని, రెండు భాషల విధానమే కొనసాగుతుందని తేల్చి చెప్పారు. తమ పార్టీని విమర్శించే వారికి ఈ సందర్భంగా గట్టిగా సమాధాన మిచ్చారు సీఎం విజయ్. ప్రజల మద్దతుతోనే తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధికారంలోకి వచ్చిందన్న ఆయన.. దీని వెనుక ఎన్నో కుట్రలు, సవాళ్లను ఎదుర్కొ న్నామన్నారు. 'జనం గుండెల్లో స్థానం సంపాదించడం అంత సులువు కాదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే ఇక్కడకు వచ్చాం. అయినప్పటికీ కొందరు 'నటుడి పార్టీ' అనే విమర్శలు గుప్పిస్తున్నారు. వాటన్నింటినీ మేం పట్టించుకోం. మా రాజకీయాలు పారదర్శకంగా ఉంటాయని విజయ్ చెప్పుకొ చ్చారు. అలాగే కుటుంబ రాజకీయాలపై ఆయన మాట్లాడుతూ.. 'మా రాజకీయాలు ఒక్క కుటుం బం కోసమే కాదు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం మాదే. అదే మా పాలన.. అదే మా లక్ష్యం' అని స్పష్టం చేశారు. ఎన్నో సవాళ్లను దాటి తాము అధికారంలోకి వచ్చామని, నటుడి పార్టీ అని తమను ఎంతోమంది ఎగతాళి చేశారని గుర్తుచేసుకున్నారు.

మాకు ఈ అధికారం అంత సులువుగా వచ్చింది కాదు. తమిళనాడు ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు నేను, నా పార్టీ ఎన్నో కుట్రలు, సవాళ్ల ను అధిగమించాల్సి వచ్చింది. మాది యాక్టర్ పార్టీ అని, నేను సినిమా షూటింగ్ నుంచి నేరుగా సీఎం కుర్చీలో కూర్చున్నానని చాలా మంది గేలి చేశారు. అలాంటి విమర్శలు నేను పట్టించుకోను. సాధారణంగా చాలా మంది రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్లోకి వెళ్తారు. కానీ, నేను ప్రజల్లోకి వెళ్లిన తర్వాత పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేశా. నాపై నమ్మకం ఉంచి ప్రజలు గెలిపించారని విజయ్ అన్నారు.

# కాంగ్రెస్ అవినీతిపై పోరాటం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కష్టంతో గెలిచిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తన స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లోకి మారారని ఆరోపించారు. ఆయననే గతంలో పదేండ్ల బీఆర్ఎస్ కాలంలో ఒక్క శేరిలింగంపల్లికి రూ.9,500 కోట్లతో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులతో ఒక ప్రగతి నివేదికను విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు.మరి ఈ రెండేండ్లలో ఎన్ని డబ్బులు నియోజకవర్గానికి తెచ్చారో గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. ?అబద్ధపు హామీలతో రేవంత్ రెడ్డి గద్దెనెక్కాడని ఆరోపించారు. తులం బంగారం, మహిళలకు రూ.2500 ఇవన్నీ ఎక్కడా అని ప్రశ్నించారు. కేసీఆర్ మళ్ళీ ఎప్పుడు అధికారంలోకి వస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ హైడ్రా పేరుతో ఆరచకాలు సృష్టిస్తోందన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ పైన కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేక్, జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కడపలో రూ.53 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**- 48 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే మాధవి,టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి**



**కడప మన జనప్రగతి 23:-** కడప నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి మరియు టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.53 లక్షల విలువైన 48 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన ప్రతి సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనేక కుటుంబాలు వైద్య ఖర్చుల భారం నుంచి ఉపశమనం పొందుతున్నాయని చెప్పారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాలో జల వనరుల పెంపుకు సమగ్ర కార్యాచరణ

**● ట్యాంక్ టు ట్యాంక్ కనెక్టివిటీ అభివృద్ధికి చర్యలు ● వర్షపు నీటి ప్రతి బొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపే లక్ష్యం: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**మదనపల్లి మన జనప్రగతి జూన్ 23:** అన్నమయ్య జిల్లాలో రానున్న వర్షాలను సమర్థవంతంగా వినియోగించుకుని జల వనరుల పెంపు దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.మంగళవారం మదనపల్లి కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రత్యేక అధికారులు, డ్వామా, ఇరిగేషన్, సాగునీటి శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జల వనరుల పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ, ప్రవాహాల మళ్లింపు, చెరువుల పునరుద్ధరణ అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 52 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. రాబోయే వర్షాలను సద్వినియోగం చేసుకుని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నింపడంతో పాటు భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.వాటర్‌షెడ్‌లు, సోర్స్ కనెక్షన్లు, క్రాస్ కనెక్షన్లు, బేసిన్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని, ఇప్పటికే మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షపు నీరు వృథా కాకుండా నిల్వ చేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.ట్యాంక్ టు ట్యాంక్ కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఫీడర్, లింక్ ఛానల్స్ అభివృద్ధి ద్వారా వరుస చెరువులను నింపే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రతి మండలంలో ప్రధాన వాగులు, వాటి ప్రవాహ సామర్థ్యంపై సమగ్ర మ్యాపింగ్ సిద్ధం చేయాలన్నారు.జిల్లాలో తాగునీటి అవసరాలు, భూగర్భ జలాల పెంపు, సాగునీటి భద్రత కోసం ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, డీఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్డీవో శ్రీనివాస్, డ్వామా పీడీ వెంకటరత్నం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ నారాయణతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి జొన్నగిరి పర్యటన ఏర్పాట్లను పరిశీలన

**- సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్,జిల్లా కలెక్టర్**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 23:-** 24న జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మంగళవారం పరిశీలించారు.జొన్నగిరిలో జియో మైసూర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంగారు గనుల ప్రాజెక్టులో నూతన ప్లాంట్‌కు ముఖ్యమంత్రి భూమిపూజ చేసి ప్రారంభించనున్న నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్, కలెక్టర్ పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.కార్యక్రమ వేదిక,రహదారులు,పారిశుద్ధ్యం,ఆహారం,తాగునీరు,విద్యుత్ సరఫరా,అంతర్జాలం, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత, వైద్య సదుపాయాల ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని సి.యం ప్రోగ్రాం కోఆర్డినేటర్, కలెక్టర్ సూచించారు.పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, శాఖల వారీగా కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్ల పర్యవేక్షణ లోపరహితంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలన సందర్భంగా కలెక్టర్ జియో మైసూర్ సంస్థ సిబ్బంది శిక్షణార్థం ఏర్పాటు చేసిన 3డి సిములేటర్‌ను సందర్శించారు. అత్యాధునిక సిములేటర్ యంత్రం ద్వారా సిబ్బందికి డ్రైవింగ్ మెళకువలు మరింత సమర్థవంతంగా నేర్పడానికి వీలవుతుందని సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పత్తికొండ ఎమ్మెల్యే కె.ఇ.శ్యాం కుమార్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమంతో రైతులకు అవగాహన

**దేవనకొండ మన జనప్రగతి జూన్ 23:-** దేవనకొండ మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "రైతన్న మీకోసం ఇంటింటి వారోత్సవాలు" కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి బి. ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సాగు పద్ధతులు, విత్తనాల ఎంపిక, పంటల సంరక్షణ, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో ఎదురయ్యే సమస్యలపై సలహాలు అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ తదితర సంక్షేమ



పథకాల గురించి వివరించారు. అర్హులైన రైతులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం సాధారణం కంటే తగ్గే అవకాశం ఉందని, దీనివల్ల వ్యవసాయం మరియు పశువర్ధక రంగాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని తెలిపారు. అందువల్ల తక్కువ నీటి అవసరం ఉండే చిరుధాన్య పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.అలాగే ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా, డీఏపీ వంటి ఎరువుల లభ్యత, పంటల శాస్త్రీయ సాగు విధానాలపై సమాచారం పొందవచ్చని వివరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఏపీఎఫ్ఆర్ లో రైతు నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, సొసైటీ చైర్మన్ రాజశేఖర్ గౌడ్, టీడీపీ నాయకులు ఆకుల వీరేష్, ఉచ్చురప్ప, రాజాసాబ్, బండ్లయ్య, జనసేన నాయకుడు ఉచ్చురప్ప, ఏఈఓలు రంగన్న, మల్లికార్జున, వీఏఏలు కళావతి, హసీనా పాల్గొన్నారు.

# విధుల్లో అప్రమత్తంగా ఉండాలి:ఎస్పీ విక్రాంత్ పాటిల్

**సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు**

**1,200 మంది పోలీసులతో భారీ బందోబస్తు**

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 23:-** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24న పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరి వద్ద ఉన్న జియో మైసూర్ గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, సభా ప్రాంగణం, ప్రయాణ మార్గాలు తదితర ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పగిడిరాయి గ్రామ సమీపంలో గోల్డ్ మైన్స్ ప్రాంతంలో విధులకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రత్యేకంగా





దిశానిర్దేశం చేశారు.భద్రతా ఏర్పాట్లలో భాగంగా మొత్తం 1,200 మంది పోలీసు సిబ్బందిని విధుల్లో నియమించారు. వీరిలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 14 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 76 మంది ఎస్సైలు, 300 మంది ఏఆర్, ఏపీఎస్పీ, స్పెషల్ పార్టీ సిబ్బంది ఉన్నారు.విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు అదనపు ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, కడప అదనపు ఎస్పీ ప్రకాష్ బాబు, నంద్యాల అదనపు ఎస్పీ చిన్ని కృష్ణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి చేయకుండా మీరు జిల్లాకు రావద్దు

**ప్రజలకు ఉపయోగం లేని కంపెనీ కోసం ఇంత ఆర్భాటం అవసరమా..?**

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు న్యాయవాది క్రాంతి నాయుడు.**

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 23:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాకు వచ్చి ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు చేశారని, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు క్రాంతి నాయుడు ప్రశ్నించారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో క్రాంతి నాయుడు మాట్లాడుతూ కర్నూలు జిల్లా పత్తికొండ నియోజక వర్గానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తున్నారని, గతంలో ఎన్నోసార్లు జిల్లాకు వచ్చారని ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదనీ ప్రశ్నిస్తున్నామని, రేపు పత్తికొండ నియోజకవర్గం గోల్డ్ మైన్స్ సర్వే చేశారని వాటిలో అవకతవకులు ఉన్నాయని బేరైటీస్ ఉత్పత్తిలో భిన్నాభిప్రాయాలు తెలియజేస్తున్నారని ప్రభుత్వము




సంవత్సరానికి 1000 కేజీలు ఇస్తామంటున్నారని, జిల్లా అధికారులు 30 కేజీలు తీస్తున్నాం అని చెబుతున్నారని స్థానికంగా భూములు ఇచ్చిన రైతులు మరియు స్థానిక యువతకు ఎంతవరకు మీరు ఉద్యోగ అవకాశాలు కల్పించారని ఎంతమంది ఇంజనీర్లను ఉపయోగించుకున్నారని కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రశ్నిస్తున్నామని 30 సంవత్సరాల లీజు ఇప్పటికీ 10 సంవత్సరాలు పూర్తయిందని మైనింగ్ జరిగే చోట యువతకు వృత్తివిద్య కోర్సులు ఏమైనా ఇచ్చారని ప్రశ్నించారు. జిల్లాకు పదేపదే వస్తున్న ముఖ్యమంత్రి గారు కర్నూలు జిల్లాకు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు హాస్పిటల్స్ మరియు ఆదోని మెడికల్ కాలేజీకి నిధులు విడుదల చేయాలని రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా కర్నూలు జిల్లా మాత్రమే అని మైనింగ్ విషయానికి వస్తే ప్రభుత్వం నడపకుండా ప్రైవేట్ సంస్థకు ఇవ్వడం వల్ల వారు కేవలం లాభాపేక్ష చూసుకుంటారని 2024 25వ సంవత్సరం వారు కట్టిన ట్యాక్స్ కేవలం 20 లక్షలు మాత్రమే అని ప్రభుత్వం కేవలం షో చేస్తుంది తప్ప ఈ ప్రాంతానికి ఎటువంటి ఉపయోగం లేదని మీరు కర్నూలు జిల్లాను అభివృద్ధి చేయాలనుకుంటే పరిశ్రమలు గాని కియా తరహాలో పరిశ్రమలు గానీ ఈ ప్రాంతంలో పెట్టలేకపోతున్నారని ప్రశ్నించారు. విద్యా, ఉపాధి కోసం వలసలు పోతున్న ప్రాంతం కేవలం కర్నూలు జిల్లా అని క్రాంతి నాయుడు గారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, ఎస్సీ సెల్ మాజీ జిల్లా చైర్మన్ ఈ లాజరస్, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ మొదలగు వారు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధి, సుందరీకరణపై దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**బద్వేలు మున్సిపాలిటీలో స్మార్ట్ జల పంపిణీ వ్యవస్థకు రూపకల్పన**

**కడప టౌన్ మన జనప్రగతి జూన్ 23 :-** కడప నగరంలో అధునాతన సాంకేతికతతో నాణ్యమైన నీటి సరఫరా వ్యవస్థతో పాటు.. పచ్చదనం, పరిశుభ్రతను మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో.. మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, బ్యూటిఫికేషన్ లతో పాటు బద్వేలు మున్సిపాలిటీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన "స్మార్ట్ జల పంపిణీ వ్యవస్థ"ను అమలు చేసేందుకు చేపట్టిన ప్రణాళికలపై.. కడప నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎస్. భావన తోపాటు జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నీటి వనరుల సమర్థ వినియోగం, నీటి నష్టాల నివారణ, ప్రజలకు నాణ్యమైన తాగునీటి సరఫరా కోసం ఆధునిక సాంకేతికతను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. బద్వేలు మున్సిపాలిటీలో ప్రతిపాదించిన విధానాన్ని పరిశీలించి కడప నగరంతో పాటు.. ఇతర మున్సిపాలిటీల్లోనూ అమలు చేసే అవకాశాలను అధ్యయనం చేయాలని



సూచించారు. ఆయా పట్టణాల్లో నీటి సరఫరా వ్యవస్థ, మౌలిక వసతులు, సాంకేతిక అవసరాలపై నివేదిక సిద్ధం చేయాలని కమిషనర్లను ఆదేశించారు.బద్వేలు మున్సిపాలిటీలో నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సాంకేతిక ఆధారితంగా మార్చే లక్ష్యంతో ఈ ప్రణాళిక రూపొందించబడిందని ప్రతినిధులు తెలిపారు. జలాశయాలు, జాక్‌వెల్‌లు, పంపు కేంద్రాలు, జల శుద్ధి కేంద్రాలు, నిల్వ ట్యాంకులు, పంపిణీ పైపులైన్ల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ పరికరాలను ఏర్పాటు చేసి నీటి మట్టాలు, ప్రవాహం, పీడనం, నీటి నాణ్యతను నిరంతరం పరిశీలించే విధంగా వ్యవస్థ పనిచేస్తుందని వివరించారు.నీటి లీకేజీలు, పైపు పగుళ్లు, ట్యాంకుల పొంగిపొర్లడం, పంపుల లోపాలు వంటి సమస్యలను వెంటనే గుర్తించి సంబంధిత అధికారులకు హెచ్చరికలు పంపే సదుపాయం ఉంటుందని తెలిపారు. దీంతో నీటి నష్టాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు నిర్వహణ వ్యయాలను కూడా నియంత్రించవచ్చని చెప్పారు.అలాగే జల శుద్ధి కేంద్రాల నుంచి ప్రజలకు చేరే వరకు నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నీటిలో క్లోరిన్ స్థాయిలు, ఆమ్ల-క్షార సమతుల్యత, మసకదనం తదితర ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించడం ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం పట్టణ నీటి సరఫరా వ్యవస్థలో నీటి లీకేజీలు, నీటి నాణ్యత పర్యవేక్షణలో లోపాలు, అధిక విద్యుత్ వినియోగం, పరికరాల లోపాలను ఆలస్యంగా గుర్తించడం, మానవ ఆధారిత నిర్వహణ వంటి సమస్యలు ఉన్నాయని వివరించారు. వీటికి పరిష్కారం గా అంతర్జాల అనుసంధాన పరికరాల ఆధారిత సమగ్ర పర్యవేక్షణ వ్యవస్థను ప్రతిపాదించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.కడప నగరంలో స్మార్ట్ జల పంపిణీ వ్యవస్థను అమలు చేసే అవకాశాలను పరిశీలించి, ఆయా పట్టణాల్లో ఉన్న అనుకూల పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కడప, బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారులు మురళి, చంద్రమోహన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. ఏడుకొండలు, కెఎంసి ఎస్.ఈ. చెన్నకేశవరెడ్డి, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం,బద్వేలు మున్సిపల్ కమిషనర్ కృష్ణా, డీఈ సుమంత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
24 - 06 - 2026

# రైతన్న మీకోసం పై ఇంటింటా ప్రచారం



**గాలివీడు మన జనప్రగతి జూన్ 23:**-గాలివీడు మండలంలోని పులికుంట రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతన్న మీకోసం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అధికారులు మాట్లాడుతూ...ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా ఉంటుందని,అందువల్ల రైతులు నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలని అలాగే రైతులకు అవసరమైన ఎరువులు ఆన్లైన్లో పంపిణీ వ్యవస్థ వినియోగంలో ఉందని,నేల పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువులు వాడే విధానం,ప్రత్యామ్నాయ పంటలు లాభదాయకం పైన పంటల గూర్చి వివరించారు.ఈ కార్యక్రమంలో రైతులు అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు యూరియా కొరత లేదు:ఏవో రమేష్ రెడ్డి



**సిద్దవటం మన జనప్రగతి జూన్ 23:**-మండలంలోని రైతుల పంటలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం టక్కోలి రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ లింగంపల్లి, కడపాయపల్లె, కాజిపల్లి, దేగనవాండ్లపల్లి గ్రామాల రైతుల కోసం 440 యూరియా బస్తాలు దిగుమతి అయ్యాయని చెప్పారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకం తీసుకొస్తే యూరియా పంపిణీ చేస్తామని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా పంపిణీ జరుగుతుందని, కొరత లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నేత నిమ్మకాయల జగన్మోహన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# సివిల్ సప్లై గోదాములో తనిఖీలు నిర్వహించిన రాష్ట్ర డైరెక్టర్ సుబ్బరాయుడు



**కడప మన జనప్రగతి జూన్ 23:**-మైదుకూరు మండలంలోని సివిల్ సప్లై గోదాములను రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన సుబ్బరాయుడు యాదవ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాముల నిర్వహణలో పలు అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు.మధ్యాహ్న భోజన పథకం, హాస్టళ్లకు సరఫరా చేసే బియ్యం బస్తాల్లో కొలతలు తగ్గించి పంపిణీ చేస్తున్నట్లు తన పరిశీలనలో బయటపడిందన్నారు. అలాగే గోదాముల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పనిచేయకుండా చేయడమే కాకుండా, వాటి దృష్టికి కదలికలు కనిపించకుండా అమర్చినట్లు గుర్తించామని పేర్కొన్నారు.చెన్నూరు సమీపంలోని ప్రధాన గోదాములో కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన నాసిరకం, పురుగులు పట్టిన బియ్యాన్ని జిల్లా సివిల్ సప్లై అధికారుల సహకారంతో రీసైక్లింగ్ చేసి సరఫరా చేస్తున్నారంటూ ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా, కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా సివిల్ సప్లై శాఖలో చోటుచేసుకుంటున్న అవకతవకలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన కోరారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- ఉప జిల్లా వైద్యాధికారి డా.గీత పిలుపు**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 23:**-ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. గీత పిలుపునిచ్చారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన పల్స్ పోలియో బూత్ వాక్సినేటర్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని సిబ్బందికి విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలియో వ్యాధి పిల్లల్లో శాశ్వత వైకల్యానికి దారితీసే ప్రమాదకరమైన వైరల్ వ్యాధి అని, 0 నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. సాధారణ టీకాలు తీసుకున్న పిల్లలు కూడా పల్స్ పోలియో కార్యక్రమంలో అదనంగా ఇచ్చే పోలియో చుక్కలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పట్టణంలో మొత్తం 102 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప బూత్‌లకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని, బూత్‌లకు రాలేని చిన్నారులకు మరుసటి రోజు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు."ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు పోలియో రహిత భారతదేశం మన లక్ష్యం" అనే నినాదంతో అందరూ సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. నజీర్ బాషా, డా. సుప్రియ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈఓ సుబ్బరాయుడు, సీఓలు సుబ్బారెడ్డి, శ్రీదేవి, నాగజ్యోతి, హెల్త్ అసిస్టెంట్లు జయపాల్, క్రిష్టఫర్, వెంకటసుబ్బయ్యతో పాటు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సచివాలయాల్లో హై సెక్యూరిటీ పేపర్లకు కరువు




**పోరుమామిళ్ల మన జనప్రగతి జూన్ 23:**-పట్టణంలోని అన్ని సచివాలయాల్లో (స్వర్ణ గ్రామాలు) హై సెక్యూరిటీ పేపర్లకు కరువొచ్చింది. ఈమధ్య కాలంలో అన్ని గ్రామ, వార్డు సచివాలయాలు కళావిహీనంగా మారిపోయాయని,సచివాలయాల వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోందని ఇప్పటికే ప్రజలు అనేక రకాలుగా ఆరోపణలు చేస్తున్నారు. ప్రజలు ఏమి మాట్లాడుకుంటే మాకు పోయేదేముందిలే అన్న ధోరణిలో ఆ శాఖ అధికారులు కూడా ఉన్నట్లు అనిపిస్తోంది. పోరుమామిళ్ల పట్టణంలోని స్వర్ణ గ్రామం -1 లో హై సెక్యూరిటీ పేపర్లు లేక సిబ్బంది ఎటువంటి ఇన్కమ్, క్యాస్ట్, 1బి సర్టిఫికెట్లతో పాటు ఇతర ఎటువంటి సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రింటింగ్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రజలు నిలదీయడంతో మేమేంచేయాలి మాకు నెలకు 50 పేపర్లు ఇస్తున్నారు, పట్టణ స్థాయిలో వున్న సచివాలయాలకు 50 పేపర్లు ఏమూలకు రావడం లేదని, ఈసమస్య తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని సిబ్బంది వాపోతున్నారు. సమస్యను ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి దృష్టికి తీసుకుపోగా శనివారం లోగా పేపర్లను సచివాలయాకు చేరవేస్తామని, భవిష్యత్తులో సమస్య రిపీట్ కాకుండా చూస్తామని చెబుతున్నారు. సచివాలయాల పేరు మార్పు కూడా ఈసమస్యకు కారణమని ఎంపీడీఓ చెబుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్ళినపుడు మాత్రం ఇలాగే చెబుతారని, పరిష్కరించే లోపల జరగాల్సిన నష్టం జరిగి పోతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం గారు! ఏనుగుల దాడుల నుంచి రైతులను కాపాడండి: మాజీ ఎంపీ తులసిరెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 23:**-ఏనుగుల బారి నుంచి రైతులను,ప్రజలను రక్షించాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేంపల్లి లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఏనుగుల బీభత్సం ఎక్కువైందన్నారు .ఆహారం, నీటి కొరత, గుంపుల మధ్య పోరాటాలతో ఏనుగులు అడవుల నుంచి సమీప గ్రామాల పంట పొలాల పైబడి పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయని, మనుషుల పై దాడి చేసి చంపుతున్నాయని ఆయన పేర్కొన్నారు 2025 జనవరి 18న తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కందులవారిపల్లి ఉపసర్పంచ్,టిడిపి నాయకులు రమేష్ చౌదరిని ఏనుగులు కాళ్లతో తొక్కి చంపాయన్నారు . అదే ఏడాది ఏప్రిల్ 25న తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం చిట్టి చర్ల గ్రామపంచాయతీకి చెందిన 65 ఏళ్ల వయసు ఉన్న రైతు సిద్దయ్యను మిరప పంటకు నీరు పెట్టేందుకు వెళ్ళగా అతనిపై ఏనుగులు దాడి చేసి చంపాయన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు, పుంగనూరు, చంద్రగిరి నియోజకవర్గాల్లో తరచు ఏనుగులు బీభత్సం చేస్తున్నాయని దీంతో రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు .విజయనగరం జిల్లాలో కూడా అనేక ప్రాంతాల్లో ఏనుగుల దాడులు జరుగుతున్నాయన్నారు . 2011 నుంచి ఇప్పటివరకు వరకు ఒక చిత్తూరు జిల్లాలోనే ఏనుగుల దాడిలో 23 మంది మరణించారన్నారు . 2003 ఎకరాల్లో పంట నాశనమైందని,గత వారం రోజులుగా అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలంలో తలకోన అటవీ ప్రాంతం నుండి ఏనుగుల గుంపులు పల్లెల మీద పడి మామిడి, కొబ్బరి పంటలను నాశనం చేస్తూ, నీటి పైపులు, మోటార్లను విరగగొడుతూ నానా బీభత్సం చేశాయన్నారు దీంతో ప్రజలకు, రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతోందన్నారు . సంబంధిత శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కర్ణాటక రాష్ట్రానికి పోయి తెచ్చిన కుంకీ ఏనుగులు ఏమయ్యాయో ఎవరికి అర్థం కావడం లేదన్నారు .స్వర్ణాంధ్ర సంతోషాంధ్ర..సంపద ఆంధ్ర దేవుడెరుగు!ముందు ఏనుగుల బెడద నుండి ప్రజలను కాపాడాలని తులసి రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి,చక్రాయపేట,వేముల మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, రామాంజనేయరెడ్డి,వెంకటేశు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్,రాఘవయ్య, వేమా రాజా తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ఈబీఎస్‌బీ శిబిరానికి ఎంపికైన చిట్వేలి ఎన్‌సిసీ క్యాడెట్లు



**చిట్వేలి మన జనప్రగతి జూన్ 23:**-చిట్వేలులోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి ట్రూపుకు చెందిన ఆరుగురు ఎన్‌సిసీ క్యాడెట్లు ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ (ఈ.బి.ఎస్.బి)" శిబిరానికి ఎంపికైనట్లు ఎన్‌సిసి ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ తెలిపారు. ఈ శిబిరం జూన్ నెల 24 నుండి జూలై 5 వరకు గుంటూరులో 12 రోజులపాటు నిర్వహిస్తారని తెలిపారు. క్యాడెట్లు తమ క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, వివిధ ఎన్‌సిసీ కార్యక్రమాలలో చూపిన ప్రతిభ ఆధారంగా ఈ జాతీయ స్థాయి శిబిరానికి ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపికైన క్యాడెట్లను అభినందించారు. క్యాడెట్ల కృషి, అంకితభావం ఫలితంగానే ఈ అరుదైన అవకాశం లభించిందన్నారు. ఈ శిబిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు, నాయకత్వ శిక్షణ, సాహస క్రీడలు, జాతీయ సమైక్యతకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. జాతీయ సమైక్యత, దేశంలోని విభిన్న సంస్కృతులపై అవగాహన పెంపొందించుకోవడానికి ఈ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. బెటాలియన్ కంపెనీ హవల్దార్ మేజర్ యమనప్ప, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఎంపికైన క్యాడెట్లను అభినందిస్తూ, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# గంగమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్టకు మంత్రి సత్య కుమార్‌ను ఆహ్వానించిన ఆసం రఘురామిరెడ్డి



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 23**-ప్రొద్దుటూరు పట్టణంలోని గంగమ్మ దేవాలయం వీధి (పప్పుల బజార్)లో గల శ్రీ గంగమ్మ దేవాలయం పునఃప్రారంభ కార్యక్రమంలో భాగంగా జులై 1న నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేక కార్యక్రమాలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్‌ను ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్మన్, ఆలయ నిర్వాహకులు ఆసం రఘురామిరెడ్డి అలాగే ఏఆర్ ట్రావెల్స్ అధినేత ఆసం సురేష్ కుమార్ రెడ్డి కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.కర్ణాటకలోని శృంగేరి శ్రీ శారదా పీఠం పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి వారి దివ్య సాన్నిధ్యంలో ఈ విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# శానిటేషన్ కార్మికుల జీతాల సమస్యకు పరిష్కారం

**- ఎమ్మెల్యే జోక్యంతో విడుదలైన మూడు నెలల వేతనాలు**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 23:**-జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల మూడు నెలల జీతాల సమస్య పరిష్కారమైందని, బకాయి వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమ కావడంతో వారు చేపట్టిన సమ్మెను విరమించినట్లు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వద్ద కార్మికులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ...గత మూడు నెలలుగా కాంట్రాక్టర్ శానిటేషన్ కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో వారి సమస్యను పరిష్కరించేందుకు తాను మద్దతుగా నిలిచానన్నారు. కార్మికుల సమస్యపై కలెక్టర్‌తో పాటు పార్టీ నాయకులు మాట్లాడగా, కాంట్రాక్టర్‌కు ఉదయం వరకు గడువు ఇవ్వాలని కోరారని చెప్పారు. దీంతో తాను కొంత ఆలస్యంగా ఆసుపత్రికి చేరుకున్నానన్నారు.తాను అక్కడికి చేరుకునే సమయానికి కార్మికుల ఖాతాల్లో మూడు నెలల బకాయి జీతాలు నెలకు రూ.11,900 చొప్పున జమ అయినట్లు సమాచారం అందిందన్నారు. అయితే ప్రతి కార్మికుడికి నెలకు రూ.13,960 చెల్లించాల్సి ఉందని, పూర్తి వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సూచన మేరకు శానిటేషన్ కార్మికులు తమ సమ్మెను విరమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ బాబు, ఆర్ఎంఓ రూపానంద్, డాక్టర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# జీవ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 23:**-జీవ ఎరువుల వినియోగంతో భూసారం పెరిగి,పంట దిగుబడులు మెరుగుపడతాయని వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని టక్కోలి రైతు సేవా కేంద్రంలో మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు కలప ఆధ్వర్యంలో కేత్ బచావో అభియాన్, డీబీటీ బయోటెక్ కిసాన్ హబ్ ద్వారా జీవ ఎరువుల పంపిణీపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణారహితంగా ఎరువుల వినియోగం వల్ల భూకాలుష్యం ఏర్పడి నేల ఉత్పాదక శక్తి తగ్గుతుందని,రైతుల ఖర్చులు పెరుగుతాయని అన్నారు. కాంప్లెక్స్ ఎరువులను ఆఖరి దుక్కిలో,యూరియాను పంట దశలను బట్టి వినియోగించాలని సూచించారు.ఏవో రమేష్ రెడ్డి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని, రైతుల అవసరాలకు అనుగుణంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతు | అభివృద్ధి మా లక్ష్యం
24 - 06 - 2026

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచండి

**● కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువకుమార్ రెడ్డి**



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 23:**–ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువకుమార్ రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలకు అనారోగ్యంతో పాటు కొన్ని కారణాల వలన రాని బాలికలకు వెనక్కి పంపినారని తల్లిదండ్రులు ఇచ్చిన పిర్యాదు మేరకు పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువకుమార్ రెడ్డి మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగాంజనేయులతో సమస్యపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇస్తున్నదని దానికి అనుగుణంగా ఉపాధ్యాయులు, హెచ్ఎంలు పని చేయాలని కోరారు. అనారోగ్యంతో పాటు బాలికలకు కొన్ని సమస్యలు ఉంటాయాని వాటిని దృష్టిలో పెట్టుకోని విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు అనుమతి ఇవ్వాలని సూచించారు. పాఠశాలకు వస్తామని చెప్పిన విద్యార్థులకు బడిలో చేర్పించుకోమని చెప్పితే చదువు మధ్యలో ఆగి పోయే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలకు రానివ్వకుండా ఉండి విద్యార్థులను బాల కార్మికులుగా చేయరాదని హెచ్ఎంను ఆయన కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే డాక్టర్ సర్టిఫికెట్లను తీసుకొని రావాలని విద్యార్థులను, తల్లిదండ్రులను వేధించడం సరికాదన్నారు. పేద ప్రజల పరిస్థితిని కూడ దృష్టిలో పెట్టుకొని వారి పిల్లలకు విద్యా అభ్యసించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

# పంటల బీమా ప్రీమియం చెల్లింపుకు సత్వరం ప్రకటన చేయాలి



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 23:**–రైతులు పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాలని వైకాపా జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ముత్తుకూరు మస్తాన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు వేంపల్లి లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి జిల్లాలో ని బ్యాంకర్లు రైతుల రుణాలను క్రమబద్ధీకరిస్తున్నారే గాని ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వము పంటల బీమా కు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయ కుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులతో చెలగాటలాడు తోందన్నారు. 2025 రబీలో కూడా ఇలాగే బీమాకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయలే దన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రతి సంవత్సరం ఇన్సూరెన్స్ కు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసి రైతుల మీద ఒక్క రూపాయి కూడా భారం పడకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చెల్లించిందని ఆయన గుర్తు చేశారు . 2024 ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు పులివెందుల పర్యటన కోసం వచ్చినప్పుడు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పాత పద్ధతిలోనే పంటల బీమా చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ఆయన హామీ నెరవేరలేదని, పాత పద్ధతి లో కాకుండా చంద్రబాబు నాయుడు స్వంత పద్ధతిలో రైతుల దగ్గర నుంచి రెండేళ్లుగా పంటల బీమా కింద రూ కోట్ల డబ్బులు ప్రీమియం కట్టించుకొని ఇంతవరకు రైతులకు ఒక్క రూపాయి కూడా బీమా విడుదల చేయలేదన్నారు . రైతులంటే కూటమి ప్రభుత్వానికి చాలా చులకనని, ఈ ప్రభుత్వ హయాంలో రైతులు పడుతున్న కష్టాలు అన్నీ కావని ఆయన ధ్వజమెత్తారు రైతుల ను పట్టించుకోని ప్రభుత్వాలు మనం కూడా సాధించలేవ న్నారు. అమరావతి కాకుండా రైతులను పట్టించుకోకుంటే కూటమి ప్రభుత్వానికి మూడేళ్ల తర్వాత వచ్చే ఎన్నికలే చివరి ఎన్నికలు అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో రైతుల పట్ల ఉన్న వివక్షత చూసి జగన్ కు చంద్రబాబు మధ్య తేడా ఏంటో రైతులకు ఇప్పుడే ఇప్పుడే అర్థమవుతుంన్నారు. ఇప్పటికైనా జిల్లాలో కూటమి నాయకులు కళ్ళు తెరిచి రైతులకు సంబంధించి పంటల బీమా చెల్లింపుకు నోటిఫికేషన్ విడుదల చేయించాలని కోరారు. అలాగే రెండేళ ్లగా రైతులకు సంబంధించి పెండింగ్లో ఉన్న బీమా పరిహారాన్ని సత్వరం విడుదల చేయించాలని రైతుల తరఫున వైకాపా రైతు విభాగం తరపున కోరుతున్నామని ఆయన పేర్కొన్నారు.

# నేరస్తుల్లో పరివర్తన తెచ్చిన అధికారి సిఐ నాగరాజు



**కాకినాడ మన జనప్రగతి జూన్ జూన్ 23:**–సస్పెండ్ చేసిన కృష్ణలంక సీఐ ఎస్ఎస్వి నాగరాజు వృత్తిలో ఎంతో నిబద్ధత కలవాడని నేరస్తుల్లో ఎంతో పరివర్తన చెందేలా వ్యవహరించి వారిలో మార్పు తెచ్చారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన నాగరాజు (బాబ్జి) పేర్కొన్నారు.సిఐ నాగరాజు హైవేలో ప్రమాదాలు జరిగినప్పుడు లారీ డ్రైవర్ల క్షతగాత్రులు అయితే వారికి వైద్యం కూడా అందించి వాళ్ల బ్రతుకులను కాపాడినట్లు బాబ్జి తెలిపారు.మంగళవారం బాబ్జి తూరంగి గ్రామంలో ఉన్న తన కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు.డ్రగ్స్,గంజాయి వంటివి అక్రమాలకు పాల్పడుతున్న వారిని అదుపులో తీసుకొని ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చి మార్పు కోసం ప్రయత్నించారన్నారు. ఆయన వల్ల ఎంతో మంది మార్పు చెందటంతో ఆయనను అరెస్టు చేయవద్దంటూ అడ్డుగా నిలిచారని పేర్కొన్నారు. వైసీపీకి చెందిన వారు నాగరాజుపై లేనిపోనిది సృష్టించి అరెస్టుకు కారకులయ్యారన్నారు. దీనికి వైసీపీ కాపు కులం ముద్ర వేసి కులాల మధ్య వివాదాలు పెడుతున్నారన్నారు. ఒకసారి తాడేపల్లిగూడెం హైవేలో లారీ ప్రమాదం జరిగితే అప్పుడు సిఐగా ఉన్న నాగరాజు డ్రైవర్ని కాపాడి అతనికి చికిత్స చేయించి ఇంటికి పంపించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. అంత సహాయం చేసిన నాగరాజుకు కులాన్ని ఆపాదించి కులాల మధ్య జగన్ వివాదాలను సృష్టిస్తున్నారని బాబ్జి పేర్కొన్నారు.జగన్ వల్ల కులాల మధ్య ఆంతర్యాలు పెరిగి ఒకరినొకరు కించపరిచే విధంగా మాట్లాడుకుంటున్నారని ఇప్పుడు పవన్ కళ్యాణ్ అందరిలో ఐక్యతను తీసుకొచ్చినట్లు చెప్పారు.పవన్ కుల నాయకుడు కాదని ప్రజానాయకుని అతని వల్ల యువత ఎంతో మేలు జరుగుతుందని బాబ్జి పేర్కొన్నారు.ఈ సమావేశంలో లారీ నాయకులు యూనియన్ నాయకులు బి శివ,వరద దొర బాబు,తర్లపు రమేష్,చిక్కం సూరిబాబు,గొల్లపల్లి రాము భజన సత్తిబాబు,తిరుమల శెట్టి శ్రీను,గ్రంధి నాని తదితరులు పాల్గొన్నారు.

# శివయ్య భక్తులకు దారి కష్టాలు

**● వర్షాలతో కోతకు గురైన నిత్యపూజేశ్వర కోన రహదారి..ఇబ్బందుల్లో భక్తులు**





**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 23:**–మండలంలోని వంతాటిపల్లి గ్రామ పరిధి లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజేశ్వర కోనకు వెళ్లే రహదారి వర్షాలకు దెబ్బతిని భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సరికోన, రాగిమాను వంక, మూతికోన, పంచలింగాల గుడి సమీప ప్రాంతాల్లో రహదారి కోతకు గురై పెచ్చులు బయటపడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రతి సోమవారం, అలాగే మహాశివరాత్రి, కార్తీక మాసాల్లో వేలాది మంది భక్తులు వచ్చే ఈ క్షేత్రంలో రహదారి పరిస్థితిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళా భక్తులకు టాయిలెట్లు, స్నానపు గదులు వంటి మౌలిక సదుపాయాలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్వామివారికి కానుకల రూపంలో ఆదాయం వస్తున్నా అభివృద్ధి పనులు జరగడం లేదని వాపోయారు. ప్రస్తుతం నిత్యపూజేశ్వర కోన ఇన్చార్జి పాలనలో కొనసాగుతుండగా, శాశ్వత ఈవోను నియమించి రహదారి మరమ్మతులు, భక్తుల సౌకర్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఇన్చార్జి ఈవో సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దెబ్బతిన్న రహదారిని పరిశీలించి, భక్తులకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.


# ఉచిత కంటి శిబిరంతో 15 మందికి శస్త్రచికిత్సల ఆశాకిరణం




**పీలేరు మన జనప్రగతి జూన్ 23:**–పీలేరు పట్టణంలోని నెట్టిబండ కాలనీలో గుడ్ షెఫర్డ్ అనాధ పిల్లలు మరియు వృద్ధాశ్రమ సేవా సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పురం రామ్మూర్తి మాట్లాడుతూ సమాజంలోని నిరుపేదలు, అనాధలు, వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించడం సేవా సంస్థల గొప్ప బాధ్యత అని కొనియాడారు. కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సేవా సంస్థలను ఆయన కోరారు.తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్జీజీ ప్రభుత్వ ఆసుపత్రి నేత్ర వైద్య విభాగం శాఖాధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ పి.ఏ.ఎస్. చలపతి రెడ్డి మాట్లాడుతూ కంటి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదిస్తే తీవ్రమైన సమస్యలను నివారించవచ్చున్నారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా చూపును సంరక్షించుకోవచ్చని వివరించారు.శిబిరంలో మొత్తం 30 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 15 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి తదుపరి చికిత్సల కోసం సిఫార్సు చేశారు. అలాగే రోగులకు అవసరమైన వైద్య సలహాలు, మందులను ఉచితంగా అందజేశారు. ఈ శిబిరం ద్వారా పలువురు పేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ అనాధ పిల్లలు మరియు వృద్ధాశ్రమ సేవా సొసైటీ అధ్యక్షులు ఈశ్వర్ బాబు, సభ్యులు చిన్న రెడ్డప్ప, వినయ్ కుమార్, తిరుపతి రుయా కంటి ఆసుపత్రి సిబ్బంది సుధాకర్, ఎం.సంతోష్ కుమార్, ఎం.జయప్రకాష్, జి.విజయ్ కుమార్, టీడీపీ నాయకులు పోలిశెట్టి సురేంద్ర (చాపల సూరి), వార్డు సభ్యులు నాగేంద్ర, ఆటో రవి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దజూటూరులో శ్రీ మస్తాన్ స్వామి మొహరం ఉత్సవాలు ఘనంగా..

**27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు**




**వేముల మన జనప్రగతి జూన్ 23:** వేముల మండలంల పరిధిలోని స్థానిక పెద్దజూటూరు గ్రామంలో వెలసిన శ్రీ మస్తాన్ స్వామి మొహరం ఉత్సవాలు ఈ నెల 27, 28, 29 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.ప్రతి ఏడాది నిర్వహించే ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని వారు పేర్కొన్నారు.జూన్ 27వ తేదీ శనివారం రాత్రి చాందినీ మెరవని కార్యక్రమం నిర్వహించనున్నారు.అనంతరం రాత్రి 12.30 గంటలకు మస్తాన్ స్వామి నిలుపుదల గుండం కాలు కార్యక్రమం జరుగుతుంది.ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.జూన్ 28వ తేదీ ఆదివారం పెద్దసరిగెత్తు మస్తాన్ స్వామి,మౌలాలీ స్వామి (జండా) గ్రామోత్సవం దండోరా డప్పులు,వాయిద్యాలు,గుర్రంతో ఆకర్షణీయ నృత్యాలతో ఘనంగా నిర్వహించనున్నారు. గ్రామ ప్రధాన వీధుల గుండా స్వామివారి ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే భక్తులు స్వామివారికి బాసికాలు,పూలమాలలు మధ్యాహ్నం 12 గంటలలోపు సమర్పించాలని నిర్వాహకులు కోరారు.జూన్ 29వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి పీర్ల జలిక కార్యక్రమం నిర్వహించనున్నారు.స్వామివారిని నమ్మిన భక్తుల కోర్కెలు నెరవేరడంతో పాటు కష్టసుఖాల్లో అండగా ఉంటారని భక్తుల విశ్వాసమని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, మొక్కుల చెల్లింపులు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.మొహరం ఉత్సవాలకు పెద్దజూటూరు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని గ్రామ ప్రజలు ఆహ్వానించారు. ఉత్సవాల విజయవంత నిర్వహణకు గ్రామ యువకులు, పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

# ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు మరువలేనివి




**వేంపల్లె మన జనప్రగతి జూన్ 23:**–ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ లో రెండు దఫాలుగా జరిగిన ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటి లకు జరిగిన కొత్త విద్యార్థుల ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్న ట్రిపుల్ ఐటి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు మరువలేనివని డైరెక్టర్ ఆచార్య గడ్డం విజయప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం ట్రిపుల్ ఐటీ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. ఇక్కడ సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ప్రస్తుతం సెలవులు ఉండటంతో వారు గ్రామాల్లోనే ఉండిపోయారన్నారు. అయితే మీరు స్వగ్రామాల నుంచి ఇక్కడికి వచ్చి తోటి విద్యార్థులకు సహాయ పడాలని తమ విజ్ఞప్తి చేశామని ఆ మేరకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అందరూ ఇడుపులపాయ కొచ్చి నాలుగు రోజులు విద్యార్థుల ప్రవేశాల్లో చాలా కష్టపడ్డారన్నారు. భవిష్యత్తులో ప్రతి విద్యార్థి సామాజిక సేవ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని తమవంతు సేవ చేసి భారతజాతి గౌరవాన్ని ప్రపంచ నలుమూలల వ్యాపింప చేయాలని ఆయన కోరారు. ఎన్ఎస్–ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జే. దీప్తి, ఎన్ఎస్ఎస్ అధికారులు రమేష్ కైలాస్, తిరుపతి రెడ్డి, అనిత, కోటేశ్వరి, సుబ్బారాయుడు, గోవర్ధన్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్లు ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వాలి: తహాశీల్దార్ మునివేలు



**బొమ్మనహాళ్ మన జనప్రగతి జూన్ 23:**–చౌక డిపోల డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి వినియోగదారులకు నిత్యావసర రేషను సక్రమంగా అందించాలని, మండల తహశీల్దార్ మునివేలు తెలిపారు,మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చౌక దుకాణాల నిర్వహకులతో సమావేశాన్ని నిర్వహించారు,ఈ సందర్భంగా తహశీల్దార్ మునివేలు మాట్లాడుతూ..ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాపులను తెరచి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు,ముందుగానే 65 సంత్సరాలు దాటిన వృద్ధులకు బియ్యాన్ని డీలర్లు ఇంటికి వెళ్లి అందించాలన్నారు,రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం వినియోగదారులకు సేవలు అందించాలన్నారు,వినియోగదారుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తగా చౌక దుకాణాలను నిర్వహించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రఘు,డిప్యూటీ ఎంపిడివో వెంకటరమణ,సీనియర్ అసిస్టెంట్,వివిధ గ్రామాల చౌక దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

# ఉద్దేహాల్‌లో గర్భిణీలు బాలింతల ఆరోగ్యపై అవగాహన ర్యాలీ




**బొమ్మనహల్ మన జనప్రగతి జూన్ 23:**–మండల పరిధిలో ఉద్దేహాల్ గ్రామం ఆర్డీటీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు,బాలింతలకు అతిసార (డయేరియా) వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్యంగా చిన్నపిల్లలు 5 సంవత్సరాల లోపు పిల్లలకు వాంతులు,విరేచనాలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని,అలాంటి సమయంలో ఓఆర్ఎస్ ద్రావణం మరియు జింక్ మాత్రల ప్రాముఖ్యత గురించి వివరించారు,అదేవిధంగా మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు,ఇంటి పరిసరాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, వారానికి ఒకసారి నీటి పాత్రలను ఖాళీ చేసి శుభ్రపరచడం,మూతలు పెట్టి నీటిని నిల్వ చేయడం, దోమతెరలు ఉపయోగించడం, వేపాకు పొగ వేయడం వంటి సూచనలు చేశారు.పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు,ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్పీ నాగమణి,ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్,అంగన్వాడీ కార్యకర్త నాగవేణి,ఆశాకార్యకర్తలు ఈరమ్మ,లక్ష్మి,హరిత,లక్ష్మి పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
24 - 06 - 2026

## జూలై 3,4 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు: ఎం.ఈ.ఓ మల్లికార్జున




**బొమ్మనహాల్ మన జనప్రగతి జూన్ 23:**–అనంతపురం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించి మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణపై మంగళవారం బొమ్మనహాళ్ ఎంఈఓ కార్యాలయంలో మండల విద్యాధికారి,మల్లికార్జున ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు,ఈ సమావేశంలో భాగంగా కోకో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల నిర్వహణపై చర్చించారు,అనంతరం ఎంఈఓ మల్లికార్జున మాట్లాడుతూ.. ఈ క్రీడ పోటీలను జూలై 3, 4 తేదీలలో ఉద్దేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు, పలు పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఆదిశేషయ్య,సుధాకర్,మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ భోగేష్,వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిట్వేలి హైస్కూల్‌కు జాతీయ సేవా పథకం యూనిట్ మంజూరు



**చిట్వేలి మన జనప్రగతి జూన్ 23:**–చిట్వేలి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ లో రాష్ట్రస్థాయి లోనే అత్యధిక సంఖ్యలో అడ్మిషన్లు పోటెత్తుతున్నాయి. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించడంతో జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర జిల్లాల నుంచి కూడా విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్లకై సంప్రదిస్తున్నారు. సంస్థలో అనేక మంది విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్‌సిసి,ఎన్ఎంఎంఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ పోటీలలో ఉత్తమ ప్రతిభ నైపుణ్యాలతో గెలుపొందారు. సంస్థ అభివృద్ధిని పరిగణించి మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్,గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, యోగి వేమన యూనివర్సిటీ,కడప లోని జాతీయ సేవా సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్. ఎన్. వెంకట్రామిరెడ్డి చిట్వేలి పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కు నూతన ఎన్ఎస్ఎస్ యూనిట్ మంజూరు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు బి.దుర్గ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌యస్‌యస్ వాలంటీర్ల ప్రధాన బాధ్యత సమాజానికి నిస్వార్థంగా సేవ చేయడం, సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వం, సామాజిక బాధ్యతలతో దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయడమే ప్రధాన లక్ష్యం అన్నారు. “నాకోసం కాదు మీకోసం“ అనే నినాదాన్ని ఆచరణలో పెట్టడం, స్వార్థం కంటే సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.సంస్థలోని ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రోగ్రాం ఆఫీసర్ గా పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న శివనారాయణ గౌడ్ ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు తిరుమల విశ్వనాథం, భాస్కర్ రెడ్డి, సుభాష్ చంద్రబోస్, వెంకటరమణ, ఎన్‌సిసి అధికారి రాజశేఖర్, వెంకటేష్, నవీన్, పెంచలయ్య, రఫీ పాల్గొన్నారు.

## నేడే ఈడిగపల్లి పీర్ల గుండం..బండలాగుడు పోటీలు



**వీరబల్లి మన జనప్రగతి జూన్ 23:**–మండలంలోని ఈడిగపల్లి గ్రామంలో మొహర్రం పీర్ల పండుగ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రి గుండం కార్యక్రమంతో పాటు భక్తులు, ప్రజల వినోదం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు నిర్వహించనున్నారు.అదే రోజు ఉదయం 10 గంటల నుంచి గ్రామంలో ఎద్దులతో బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరగనున్న నేపథ్యంలో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**వైభవంగా చిన్న పీర్ల మేరమణి**

పీర్ల పండుగ జాతరలో భాగంగా ఏడో రోజు చిన్న పీర్ల మేరమణి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈడిగపల్లి నుంచి బయలుదేరిన చిన్న పీర్లు బట్టుపల్లి మీదుగా పాతదిబ్బల ప్రాంతానికి చేరుకోగా, వీరబల్లికి చెందిన చిన్న పీర్లు ఎదురెళ్లి ఆహ్వానం పలకడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం చిన్న పీర్లు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మేరమణి నిర్వహించి తిరిగి ఈడిగపల్లికి చేరుకున్నాయి. కార్యక్రమం అంతటా భక్తులు భక్తి పారవశ్యంలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవనానికి మోక్షం ఎప్పుడు..?

- ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిన నిర్మాణం
- దళిత సంఘాల డిమాండ్‌కు స్పందించని అధికారులు



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూన్ 23:**బొమ్మనహాల్ మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరిట నిర్మిస్తున్న భవనం గత కొన్నేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయి శిథిలావస్థకు చేరుకోవడం పట్ల అంబేద్కర్ సేన, దళిత సంఘాల నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దళిత, బహుజన వర్గాల అభ్యున్నతికి, సామాజిక చైతన్య కార్యక్రమాలకు కేంద్రంగా ఉండాల్సిన ఈ భవనం నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడం బాధాకరమని పేర్కొన్నారు.భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని దండోరా, అంబేద్కర్ సేన, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై స్పందించకపోవడం వల్ల భవనం రోజురోజుకూ మరింత దెబ్బతింటోందని తెలిపారు. వర్షాలు, ఎండల కారణంగా నిర్మాణ భాగాలు పాడైపోతుండటంతో ప్రభుత్వ నిధులు వృథా అయ్యే ప్రమాదం ఉందన్నారు.ఈ సందర్భంగా అంబేద్కర్ సేన జిల్లా యువసేన అధ్యక్షుడు కె.సి. పవన్ కుమార్ మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమాజంలోని అణగారిన వర్గాలకు విద్య, సమానత్వం, హక్కుల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అలాంటి మహనీయుడి పేరుతో నిర్మిస్తున్న భవనాన్ని నిర్లక్ష్యం చేయడం సమాజానికి మంచిది కాదన్నారు. దళిత, బహుజన వర్గాల సామాజిక, విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.అంబేద్కర్ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి అవసరమైన సౌకర్యాలతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను ఆయన కోరారు. ఇకపై కూడా స్పందన లేకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టే విషయాన్ని పరిశీలిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేన నాయకులు విజయ్, ఓబులేష్, నరసింహ, శివరాజు, వన్నూర్ తదితరులు పాల్గొని భవనం నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయండి: జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్




**కాకినాడ మన జనప్రగతి జూన్ 23:**–ఈ నెల 28న జిల్లాలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లోని గౌతమీ హాలులో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్, విద్య, డీఆర్డీఏ, ఐసీడీఎస్, పరిశ్రమలు, ప్రజారవాణా శాఖల అధికారులకు జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జేసీ.. అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 28న పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమం కోసం జిల్లా వ్యాప్తంగా 1,44,762 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసేందుకు 990 బూతులు, 56 ట్రాన్సిట్ పాయింట్లు మరియు 61 మొబైల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు జేసి తెలిపారు. అదేవిధంగా 131 మంది రూట్ సూపర్‌వైజర్ల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేయడం జరుగుతుందని వివరించారు. కాకినాడ జిల్లాను పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు వాట్సాప్ సందేశాలు, గ్రామీణ ప్రాంతాల్లో టాం..టాం వేయించడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రచారం చేయాలని జేసీ అధికారులలకు స్పష్టం చేశారు. అదేవిధంగా జూన్ 27న మైక్ అనౌన్స్‌మెంట్లు, ర్యాలీల ద్వారా గ్రామీణ, పీహెచ్సీ పరిధిలో అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పే నాయక్, డిఎంహెచ్ఓ డా.జె.నరసింహ నాయక్, డిఎల్టిఒ డా.చలమయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డా. కె.వి.సుబ్బరాజు,ఐసీడీఎస్ పీడీ సీ లక్ష్మి, సీపీవో పి.త్రినాథ్,ఎస్బీ డీఎస్పీ సత్యనారాయణ ఇతర శాఖల అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం వేడుకల్లో చాదర్ సమర్పించిన టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి

**కడప మన జనప్రగతి జూన్ 23:**– కడప నగరంలోని అలంఖాన్‌పల్లిలో ఘనంగా నిర్వహిస్తున్న మొహర్రం ఉత్సవాల్లో టీడీపీ జోనల్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన పీర్ల మకాన్‌ను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పవిత్ర చాదర్‌ను సమర్పించారు.మొహర్రం వేడుకల సందర్భంగా మత పెద్దలు, భక్తులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న శ్రీనివాస రెడ్డి, సమాజంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అలాగే నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో,ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు.మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం ఉత్సవాలు అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మొహర్రం శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రైతు అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది: మారెడ్డి లతా రెడ్డి



**పులివెందుల మన జనప్రగతి జూన్ 23:**–మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో జాతీయ ఆహార నూనెల మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేరుశెనగ రైతు శిక్షణ, అవగాహన మరియు వేరుశెనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమంలో పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతా రెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు మద్దరు వెంకట్రామిరెడ్డి ,పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, పులివెందుల మండల టీడీపి అధ్యక్షుడు మర్తల జగన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వేరుశెనగ పంట సాగులో అనుసరించాల్సిన ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నాణ్యమైన విత్తనాల ఎంపిక, సమతుల్య ఎరువుల వినియోగం, పురుగు మరియు వ్యాధుల నివారణ చర్యలపై సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి అవసరమైన సూచనలు చేశారు.అదేవిధంగా రైతులకు ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన సమాచారాన్ని అందజేయడంతో పాటు, వేరుశెనగ సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో నాణ్యమైన వేరుశెనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించాలని సూచించారు.ఈ సందర్భంగా మారెడ్డి లతా రెడ్డి , మద్దరు వెంకట్రామిరెడ్డి గారు గడ్డం అమర్నాథ్ యాదవ్ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో మరింత పురోగతి సాధించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేముల మండలానికి నేడు మాజీ సీఎం వైఎస్ జగన్ రాక

- గట్టు శ్రీ నరసింహస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొననున్న జగన్
- ఇటీవల మృతి చెందిన శ్రీరామిరెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ.
- పర్యటనకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృత ఏర్పాట్లు



**వేముల మన జనప్రగతి జూన్ 23:**–మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేడు వేముల మండలంలో పర్యటించనున్నారు.ఈ సందర్భంగా మండల పరిధిలోని భూమయ్యగారిపల్లె సమీపంలో దాదాపు 3 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన గట్టు శ్రీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఉదయం 9 గంటలకు ఆయన పాల్గొననున్నారు. ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొని ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై స్థానికులతో మాట్లాడనున్నట్లు సమాచారం.అనంతరం ఇటీవల మృతి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ సర్పంచ్,మాజీ ఎంపీటీసీ సభ్యులు ఓబుల్ రెడ్డి శ్రీరామిరెడ్డి కుటుంబ సభ్యులను మాజీ సీఎం జగన్ పరామర్శించనున్నారు.వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ధైర్యం చెప్పనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తూ వారి సమస్యలను తెలుసుకొని అవసరమైన సహాయ సహకారాలపై హామీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.మాజీ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వేముల మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. జగన్ రాకతో మండలంలో రాజకీయ,సామాజిక వర్గాల్లో ఆసక్తి నెలకొంది.భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు,అభిమానులు,ప్రజలు కార్యక్రమాలకు హాజరయ్యే అవకాశం ఉందని నాయకులు తెలిపారు.పర్యటనను విజయవంతం చేసేందుకు స్థానిక నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

## విద్యుత్ ఉద్యోగులకు వెంటనే నూతన పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలి

కాంట్రాక్ట్ కార్మికులకు రూ.46 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్







**అనమయ్య జిల్లా ప్రతినిధి మన జనప్రగతి జూన్ 23:**–విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నూతన పీఆర్సీ (పే రివిజన్ కమిషన్) కమిటీని ఏర్పాటు చేయాలని సీఐటీయూ మరియు విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనంగా రూ.46 వేల చెల్లింపును అమలు చేయడంతో పాటు యువగళం పాదయాత్ర సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు లంచ్ అవర్ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ.వి. రమణ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిస్కమ్ అధ్యక్షుడు కె. సుబ్రహ్మణ్యం రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఇప్పటివరకు పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు.విద్యుత్ ఉద్యోగులకు బకాయిగా ఉన్న మూడు డీఏలు (కరువు భత్యాలు) వెంటనే విడుదల చేసి ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. అలాగే ఇటీవల గౌరవ హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.46 వేలు చెల్లించడంతో పాటు శాఖలో ఉన్న ఖాళీ పోస్టులను కాంట్రాక్ట్ కార్మికులతోనే వెంటనే భర్తీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు సి. నాగేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసులు రెడ్డి, రామాంజులు రెడ్డి, శ్రీధర్, గజేంద్ర నాయుడు, రామా ంజులు తదితర నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు, విద్యుత్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం



# ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ముగిసిన ప్రవేశాలు

**● 822మందికి ప్రవేశాలు ● ప్రవేశాలకు 188 మంది విద్యార్థుల గైరాజరు**






**వేంపల్లె మన జనప్రగతి జూన్ 23:**-ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలోని ఒంగోలు ట్రిపుల్ ఐటీ లో 2026- 27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. ఇక్కడి కేంద్ర గ్రంథాలయంలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ విజయ ప్రకాష్ నేతృత్వంలో ఈ ప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ట్రిపుల్ ఐటీ కి 1010 విద్యార్థులకు గాను రెండు రోజుల్లో 822 మంది విద్యార్థులు హాజరై ప్రవేశాలు పొందారు. 188 మంది విద్యార్థులు ప్రవేశాలకు గైర్హాజరయ్యారు. ఆ సీట్లు ఖాళీగా ఉన్నట్లు వర్సిటీ అధికారులు ప్రకటించారు. ఈ సీట్లను రెండో విడత వెయిటింగ్ జాబితాను ప్రకటించి మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి మరో విడత కౌన్సిలింగ్లో వారికి సీట్లు కేటాయించ నున్నట్లు అధికారులు ప్రకటించారు. కాగా ఒంగోలు ట్రిపుల్ ఐటికి సంబంధించి పియుసి1, పియుసి 2 తరగతులు ఇడుపులపాయలో నే జరుగుతాయని వారు తెలిపారు. కార్యక్రమంలో ఇడుపులపాయ ఒంగోలు ట్రిపుల్ ఐటీల పరిపాలన అధికారులు రవికుమార్,చంద్రశేఖర్,అకాడమిక్స్ డీన్లు రమేశ్ కైలాష్,రూపస్ కుమార్ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ వెంకటేష్ అసోసియేట్ డీన్స్ రాఘవ రెడ్డి, నవీన్, ఉదయశ్రీ, హుస్సేన్, తిలక్సెక్యూరిటీ ఆఫీసర్ శరవణ కుమార్ సాఫ్ట్వేర్ ఇంజనీర్స్ లింగమూర్తి జ్ఞానవెంకట్ ఐటీ ఇన్ఫ్రా కోఆర్డినేటర్ సంతోష్ బిన్నీ, ఓబయ్య, కొనప్ప, రాము, దీప్తి, భాస్కరయ్య,వీఆర్వో తిరుపతి రెడ్డి,వెల్ఫేర్ ఆఫీసర్లు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అధ్యపకేతర బృంద సభ్యులు పాల్గొన్నారు.

## "ప్రొటెక్టెడ్ కల్టివేషన్ - షేడ్ నెట్ హౌస్" నర్సరీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి





**కడప రూరల్ మన జనప్రగతి జూన్ 23:-** రాష్ట్ర ఉద్యాన శాఖ, జాతీయ హార్టికల్చర్ మిషన్ సంయుక్త సహకారంతో 50% సబ్సిడీతో కలిపి రూ. 22.70 లక్షల వ్యయంతో బి. రాజారెడ్డి.. ఏర్పాటు చేసిన షేడ్ నెట్ హౌస్ నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ.. సంబందిత రైతు, అధికారులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్. ఉద్యాన పంటల హబ్ గా కడప జిల్లా రాష్ట్రంలోనే కీలకంగా మారుతున్న నేపథ్యంలో.. ఉద్యాన రైతులకు వ్యాధులను తట్టుకునే ఆరోగ్యకరమైన ఉద్యాన మొక్కలను అందించే షేడ్ నెట్ కల్చర్.. ఉద్యాన రైతులకు ఎంతో ఉపయోగం అని ప్రశంసించిన జిల్లా కలెక్టర్జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయా లేదా అనే అంశంపై... చెన్నూరు మండల కేంద్రంలోని సుప్రియ రైతు డిపోను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిరైతు డిపోలో ఫర్టిలైజర్, సీడ్స్, ఫెస్టిసైడ్ ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించిన సప్లిమెంట్స్, విత్తనాలు మొదలైన స్టాకును, రేట్లను, నాణ్యతను పరిశీలించి.. నిర్వాహకులకు సూచనలిచ్చిన జిల్లా కలెక్టర్. అనంతరం చెన్నూరు మండలంలోని రామన్నపల్లెలోని, రైతు సేవా కేంద్రాన్ని, పశు వైద్యశాలను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవలు, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్యశాలలో మెరుగైన సేవలు అందుతున్నాయా లేదా అని.. పశు రైతులను అడుగుతూ.. వైద్యశాలలో మందుల స్టాకు, సదుపాయాలను పరిశీలించి.. వైద్య సిబ్బందికి సూచనలిచ్చిన జిల్లా కలెక్టర్. ఖాజీపేట మండల పరిధిలో.. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో స్థానిక రైతులు నూతనంగా సాగులోకి తీసువచ్చిన అరటి పంటను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ఉద్యాన పంటలకు అనువైన వనరులు పుష్కలంగా ఉన్న ఈ ప్రాంతంలో.. ఉద్యాన పంటలను సాగు చేసేందుకు ముందుకు రావాలని, దీర్ఘకాలిక లాభాలిచ్చే ఉద్యాన పంటలపై మొగ్గు చూపాలని రైతులకు సూచించిన జిల్లా కలెక్టర్. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుబ్రహ్మణ్యేశ్వర రావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, సహాయకులు, పశువైద్య సిబ్బంది తదితరులు.

# పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలి

**- గోడపత్రికలను ఆవిష్కరించిన జిల్లా జడ్జి జి.కబర్ధి**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 23:**-పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు రూపొందించిన పోక్సో (గూజూూ) చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు, జిల్లా జడ్జి జి. కబర్ధి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం2012పై ప్రచురించిన గోడపత్రికలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడిన వారిపై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. పిల్లల భద్రత, హక్కుల పరిరక్షణ కోసం ఈ చట్టం సమర్థవంతంగా అమలులో ఉందన్నారు. పోక్సో కేసుల త్వరిత పరిష్కారం కోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పిల్లలు లేదా వారి కుటుంబ సభ్యులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే న్యాయ సహాయం కోసం లీగల్ సర్వీసెస్ టోల్ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అనిల్ కుమార్, లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజం కోసం మరోసారి పల్స్ పోలియో కవచం

**జూన్ 28న జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణ**

**ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలని డీఎంహెచ్ఓ డా.కె.లక్ష్మీ నరసయ్య పిలుపు**




**మదనపల్లె మన జనప్రగతి జూన్ 23:**-పోలియో రహిత సమాజ పరిరక్షణకు ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డా. కె. లక్ష్మీ నరసయ్య పిలుపునిచ్చారు. జూన్ 28న నిర్వహించనున్న జాతీయ రోగనిరోధక దినోత్సవం (ఎన్ఐడీ) పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం డీఎంహెచ్ఓ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1995-96 నుంచి పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో 2011 జనవరి 13 తర్వాత ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని,పోలియో రహిత హోదాను కొనసాగించేందుకు ప్రతి చిన్నారికి టీకా అందించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. జూన్ 28న బూత్ల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు, అనంతరం రెండు రోజుల పాటు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి టీకా కార్యక్రమాన్ని కొనసాగిస్తారని తెలిపారు. బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, నిర్మాణ ప్రాంతాలు, వలస కార్మికులు నివసించే ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక బూత్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ, రవాణా శాఖ, రైల్వే శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమ విజయవంతానికి సహకరించాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలియో నివారణపై రూపొందించిన గోడ పత్రికలను డీఎంహెచ్ఓ డా. కె. లక్ష్మీ నరసయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. జి. ఉషాశ్రీ, జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డా. ఎల్. రాధిక, ఐసీడీఎస్ అధికారి హైమావతి, ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిని తట్టుకునే పంటలను ఎంచుకోండి


**● రైతు సేవల దరఖాస్తు వ్యవస్థలో నమోదు చేసుకుని ఎరువులు సులభంగా పొందండి**

**● రైతన్న మీకోసం కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే.రాజు పిలుపు**



**తొండూరు మన జనప్రగతి జూన్ 23:**-రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడిని తట్టుకునే పంటలను ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కే. రాజు సూచించారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా బూచుపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలోని భద్రంపల్లి గ్రామంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, దీనివల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటల దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. రైతులు ముందస్తు జాగ్రత్తగా నీటి కొరతను తట్టుకునే పంటలను సాగు చేయడంతో పాటు వ్యవసాయ చెరువులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా నేలలో తేమ శాతాన్ని నిల్వ ఉంచి పంటలను సంరక్షించుకోవచ్చని తెలిపారు. అలాగే రైతులు రైతు సేవల దరఖాస్తు వ్యవస్థలో నమోదు చేసుకుని యూరియా, డి.ఏ.పీ. తదితర ఎరువులను సులభంగా పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు శాలిని, రైతు శాస్త్రవేత్త వెంకటరాములు, రైతులు శ్యామసుందర్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, శివశంకర్ రెడ్డి, ఆంజనేయులు, రాజశేఖర్ రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# హీర్దేహాల్ గ్రామ శివారులో మగ వ్యక్తి మృతదేహం కలకలం



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూన్ 23:**-డి.హీరేహాల్ మండలం హీర్దేహాల్ గ్రామ శివారులో సుమారు 30-35 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మగ వ్యక్తి శవం లభ్యమైంది,మృతుడు తెలుపు-నీలం రంగు చెక్స్ ఫుల్ హ్యాండ్ షర్ట్,సిమెంట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు,శవం ముఖభాగం,దుస్తులు కాలిపోయి ఉన్నాయి,ఈ వ్యక్తి వివరాలు తెలిసిన వారు లేదా ఇటీవల తమ కుటుంబ సభ్యులు,బంధువులు, గ్రామ పరిసరాల్లో ఎవరైనా కనిపించకుండా పోయినట్లు తెలిసిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు,సమాచారం ఇచ్చిన వారికి తగిన బహుమతి అందజేయబడుతుంది,సంప్రదించవలసిన నంబర్లు:సీఐ,రాయదుర్గం రూరల్: 9440796825ఎస్సై,డి.హీరేహాల్ పీఎస్: 9490109174

# పేదలకు సంజీవని 'ముఖ్యమంత్రి సహాయనిధి

**- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 23:-** నియోజకవర్గంలో 36 మంది లబ్ధిదారులకు రూ. 19.98 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ పేదల సంక్షేమంలో రాజీ పడని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు. కష్టకాలంలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి నిజంగా ఒక సంజీవనిలా పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో పులివెందుల నియోజకవర్గానికి చెందిన నిరుపేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన 36 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 19.98 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ, పేదల సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత మానవతా దృక్పథంతో ఈ సహాయాన్ని కొనసాగించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పులివెందుల నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి సీఎం సహాయనిధి అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తూ, ఆపద సమయంలో భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి కి పులివెందుల నియోజకవర్గ ప్రజల తరఫున రామగోపాల్ రెడ్డి ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఐ యఫ్ బిలో ప్రాంతీయ పరిశోధనా సమావేశం

**- వికసిత భారత్ @ 2047 లక్ష్యంగా దూలపల్లిలో ప్రాంతీయ పరిశోధనా సదస్సు**




**కుత్బుల్లాపూర్ మన జన ప్రగతి జూన్ 23:-** దూలపల్లి పరిధి లోని జీవ వైవిధ్య సంస్థ లో జరిగిన వికసిత భారత్ 2047 లక్ష్య సాధన లో భాగంగా దూలపల్లి లో ప్రాంతీయ పరిశోధనా సదస్సు నిర్వహించ బడింది. ఈ సదస్సు ను హైదరాబాద్లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ, రాంచీలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ ప్రోడక్టివిటీ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి డాక్టర్ సువర్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎస్ పట్నాయక్ మాట్లాడుతూ వికసితభారత్ 2047 లక్ష్యంగా హైదరాబాద్ ఐఎఫ్బి లో ఎటువంటి పరిశోధనలు జరగాలి, ఇప్పటివరకు ఎలాంటి పరిశోధనలు జరిగాయి. అంతరించిపోతున్న ఎన్నో జీవజాతులను ఎలా పునరుద్ధరించాలి, భవిష్యత్తు తరాలకు ఆ జీవజాలాన్ని ఎలా అందించాలి అనే అంశాలపై ఈశాన్య భారతం అయిన ఒరిస్సా, జార్ఖండ్, వెస్ట్ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన అధికారులు హైబ్రిడ్ విధానంలో చర్చించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఎస్. పట్నాయక్,ముఖ్య అటవీ సంరక్షణ అధికారి డాక్టర్ సువర్ణ, పరిశోధన సమన్వయకర్త డాక్టర్ దీప, డైరెక్టర్ ఆఫ్ జనరల్ డాక్టర్ కాంచన దేవి, కార్యక్రమాల అధికారి సందీప్, సైంటిస్టులు డాక్టర్ పంకజ్ సింగ్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శివప్రసాద్, రిటైర్డ్ అధికారి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సన్మాన కార్యక్రమం



**ఉరవకొండ మన జనప్రగతి జూన్ 23:**-ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన ప్రిన్సిపాల్గా బాధ్యతలు స్వీకరించిన డా. టి. శైలజా రాణికి ఆత్మీయ స్వాగతం పలుకుతూ, ఇటీవల డాక్టరేట్ పట్టా పొందిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.టి.ఎన్. మస్తానప్పను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..డా.టి.శైలజా రాణి విద్యా అనుభవం, పరిపాలనా నైపుణ్యం కళాశాల అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే డాక్టరేట్ సాధించిన డా.టి.ఎన్.మస్తానప్పను అభినందిస్తూ,ఆయన పరిశోధనా తపన,కృషి విద్యార్థులకు ఆదర్శప్రాయమని కొనియాడారు. కళాశాలలో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం అధ్యాపకులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీడీసీ సభ్యులు డా.కె.కె.ప్రసాద్, లయన్ గణేష్ బాబు,జై కిసాన్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగమల్లి ఓబులేష్,సీపీడీసీ కో-ఆర్డినేటర్ అయ్యన్న,కళాశాల అధ్యాపకులు,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశం,సమాజం బాగుండాలనేదే పవన్ ఆలోచన ఆశయం

**● కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు జగన్ విఫల యత్నం ● వైసీపీ నాయకుల పై జనసైనికులు ఆగ్రహం**



**కాకినాడ మన జనప్రగతి జూన్ 23:**–రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దేశం, సమాజం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రాజకీయాలు చేస్తున్న నాయకుడని జనసేన పార్టీ నాయకులు పేర్కొన్నారు. యువత భవిష్యత్తు, రాష్ట్ర ప్రగతి, సామాజిక సమతుల్యత కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని చెప్పారు. కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ కదలి ఈశ్వరి, సూపర్ బజార్ చైర్మన్ ప్రెసింగి ఆదినారాయణ, దళిత నాయకుడు పిట్టా జానకిరామయ్య తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కులాలు, సామాజిక వర్గాల మధ్య ఐక్యతను పెంపొందించేందుకు పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం కులాల పేరుతో ప్రజలను విభజించే ప్రయత్నాలు సమాజానికి మంచిది కాదని అన్నారు. గత వైసీపీ పాలనలో కుల, వర్గ రాజకీయాలను ప్రోత్సహించి ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అయితే పవన్ కళ్యాణ్ మాత్రం అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ సమాజంలో సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి, విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో ఆయన ముందుకు సాగుతున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్‌ను ఒక కులానికి పరిమితం చేసి చూపించే ప్రయత్నాలు కొందరు చేస్తున్నారని, అలాంటి వ్యాఖ్యలను ప్రజలు నమ్మబోరని అన్నారు. ఆయనకు అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేసే నాయకుడిగా ప్రజల్లో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. వైసీపీ కుట్రలో కాపు నాయకులు చిక్కుకోవద్దని సూచించారు. తమ అధినేత పవన్ కళ్యాణ్ పైన అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి విమర్శ చేస్తే ఎందుకు మౌనంగా ఉన్నారంటూ ప్రశ్నించారు. వైసీపీకి ఊడిగం చేయడం మానుకోవాలని సూచించారు. పవన్‌పై వ్యక్తిగత విమర్శలు, కులపరమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధి, పారదర్శక పాలన, సామాజిక న్యాయం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలు కూడా అభివృద్ధి రాజకీయాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించడమే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పిట్టా జానకిరామ్, అడ్డాల సత్యనారాయణ, నందమూరి వినోద్, చోడిశెట్టి శ్రీమన్నారాయణ, ఆకుల శ్రీనివాస్, నల్లం శ్రీనివాస్, పెంకే వెంకటలక్ష్మి, బుల్లెట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహు పర్యటన

**● రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం ● కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహు ● సీఎం చంద్రబాబు విజన్‌తో అమరావతి నిర్మాణం వేగంగా సాగుతోంది: కేంద్ర మంత్రి**



**అమరావతి మన జనప్రగతి జూన్ 23:**– కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి తోకన్ సాహు తో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం సీఆర్డీయే కార్యాలయంలో రాష్ట్రంలోని పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ రంగాల్లో అమలవుతున్న పథకాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఎండీ అరుణ్ కుమార్, టిడ్కో ఎండీ సునీల్ కుమార్ రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, చైర్మన్ పట్టాభిరామ్‌తో పాటు హడ్కో, మెప్మా, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రంలో పురపాలక, గృహ నిర్మాణ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ పథకాల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యంగా టిడ్కో ఇళ్ల నిర్మాణ ప్రస్తుత స్థితి, మెప్మా ద్వారా అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మాణానికి రూపొందించిన విజన్‌ను అభినందించారు. ఆధునిక సౌకర్యాలు, సమగ్ర ప్రణాళికతో అమరావతి దేశంలోనే ఆదర్శవంతమైన రాజధానిగా రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు.

# ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ పరిశీలించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్





**చెన్నూరు మన జనప్రగతి జూన్ 23:**–జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి శ్రీధర్ మంగళవారం చెన్నూరు మండలంలోని సుప్రియ రైతు డిపోతో పాటు పలు ప్రైవేటు ఎరువుల దుకాణాలను సందర్శించి, ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్, నూతన విధానం వల్ల ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరిగిందని తెలిపారు. యూరియాను ఒకేసారి కాకుండా పలు దఫాలుగా వేయడం వల్ల పంటలకు మేలు జరుగుతుందని రైతులకు సూచించారు. అనంతరం రామనపల్లి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి నిర్వహించిన "రైతన్న మీకోసం" కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల కింద రైతులకు అందుతున్న లబ్ధిపై ఆరా తీసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ ఏడాది ఎల్‌నీనో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. అలాగే ఉద్యానవన పంటల సాగు రైతులకు అధిక లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎల్‌నీనో ప్రభావాన్ని తట్టుకునేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఘన జీవామృతం, సీడ్ పెల్లెటైజేషన్ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. పీఎండీఎస్ విధానంలో రైతులు 30 రకాల విత్తనాలు సాగు చేయాలని సూచించారు. జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎం. సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ, రైతులు అవసరమైన సమయంలోనే ఎరువులు పొందే అవకాశం ఈ విధానంలో ఉందని, క్యూలలో నిలబడాల్సిన అవసరం లేదని తెలిపారు. కౌలు రైతులకు కూడా యాప్ ద్వారా యూరియా, డీఏపీ పొందే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు జి. లక్ష్మీమాధవి, మండల వ్యవసాయ అధికారి కె. శ్రీదేవి, టెక్నికల్ అగ్రికల్చర్ ఆఫీసర్లు బి. కృష్ణసమత్ రెడ్డి, గోవర్ధన్, మండల రెవెన్యూ అధికారి విజయకుమారి, గ్రామ వ్యవసాయ సహాయకులు వసంత, గంగాభవా ని, ఈశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్సీపీ ఆరోపణలపై ఆగ్రహించిన టీడీపీ నేతలు


**- డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసిన టిడిపి నాయకులు**



**నెల్లూరు మన జనప్రగతి జూన్ 23:**– నెల్లూరు నగరంలోని అంబేద్కర్ బొమ్మ సాక్షిగా వైసిపి నేతలు కాకాణి గోవర్ధన్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిసి పెద్ద రాజకీయ డ్రామాకు తెరలేపారంటూ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మండిపడ్డారు. మీ వీధి డ్రామాలకు అభివృద్ధితో సమాధానం చెబుతారు. నారాయణ సార్ ది కక్ష సాధించే స్వభావం అయితే నెల్లూరులో రాజకీయం చేయగలవా చంద్రశేఖర్ రెడ్డి . వైఎస్ఆర్సీపీ ఐదేళ్ళ పాలనలో కక్షసాధింపులను దగ్గరుండి చూసా , చీప్ రాజకీయాలు ఇకనైనా మానుకోండి. కృష్ణచైతన్య తో పాటు నారాయణ,భాష్యం స్కూల్స్ కి కూడా నోటీసులు ఇచ్చారు . విద్యా శాఖలో సాధారణంగా జరిగిన తనిఖీలను రాజకీయ స్వార్ధనికి వాడుకుంటున్నారు. దుర్మార్గపు ఆలోచనలతొ పొలిటికల్ డ్రామాలు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు మీ నీచరాజకీయాలు గమనిస్తున్నారు. లోకేష్ బాబు మీ లా ఆలోచిస్తే కృష్ణ చైతన్య విద్యాసమస్థలు మూతపడేవి. మంత్రి నారాయణ మీ వికృత రాజకీయాలకు అభివృద్ధితోనే సమాధానం చెపుతారు. నెల్లూరు కార్పొరేషన్ మరియు డీలిమిటేషన్ ప్రక్రియ గురించి మాట్లాడే ఈ వైసిపి నేతలకు అసలు మున్సిపల్ చట్టాలు, వాటి ప్రాతిపదికలు తెలుసా అని కడిగిపారేశారు. కోర్టు ఏదో స్టే ఇచ్చిందని ఎగిరెగిరి పడుతున్నారని, తమకు న్యాయస్థానాలపై పూర్తి విశ్వాసం ఉందని, వీటన్నింటికీ కాలమే సమాధానం చెప్తుందన్నారు. నారాయణ గారి పక్షాన నెల్లూరు నగరం మొత్తం ఉంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, నగర అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇంచార్జ్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రాయలసీమలో 'పసిడి' పంట..జొన్నగిరిలో గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టుకు శ్రీకారం





**రూ.405 కోట్ల పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు**

**తొలి ఏడాది 400 కిలోల బంగారం ఉత్పత్తి..దశలవారీగా 2 టన్నులకు పెంపు**

**బుధవారం సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం**



**అమరావతి/కర్నూలు మన జనప్రగతి జూన్ 23:**–కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి ఇకపై బంగారం ఉత్పత్తికి కొత్త కేంద్రంగా అవతరించనుంది. ఇప్పటివరకు కర్నాటకలోని కేజీఎఫ్ బంగారు గనులు ప్రసిద్ధి చెందగా, ఇకపై ఆంధ్రప్రదేశ్‌లోని జొన్నగిరి కూడా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే దిశగా అడుగులు వేస్తోంది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు జొన్నగిరిలో ఏర్పాటై, బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభంకానుంది. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా రూ.405 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టును నెలకొల్పాయి. ప్రాజెక్టు కోసం ప్రభుత్వం 1,500 ఎకరాల భూమిని కేటాయించగా, తొలి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు చేపట్టనున్నారు. ఇందుకు అవసరమైన ప్రాసెసింగ్ ప్లాంట్లు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ప్రస్తుతం ఏర్పాటు చేసిన ప్లాంట్ ద్వారా తొలి ఏడాదిలో 400 కిలోల బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అనంతరం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతూ వచ్చే ఏడాది 900 కిలోలకు, ఆ తర్వాత దశలవారీగా ఏడాదికి 2 టన్నుల వరకు బంగారం ఉత్పత్తి చేయనున్నారు. ప్రాజెక్టు విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 700 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఉత్పత్తి అయ్యే బంగారం విలువలో 4 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీగా అందనుంది. తొలి దశలో 400 కిలోల బంగారం ఉత్పత్తితో సుమారు రూ.57 కోట్ల ఆదాయం, 900 కిలోల ఉత్పత్తి స్థాయికి చేరుకున్నప్పుడు సుమారు రూ.144 కోట్ల వరకు రాయల్టీ ఆదాయం రాష్ట్ర ఖజానాకు సమకూరే అవకాశం ఉంది. ప్రాజెక్టుకు అవసరమైన నీటి కోసం హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం ద్వారా 18 కిలోమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేసి 0.021 టీఎంసీల నీటిని వినియోగించనున్నారు. గనిలో ఇప్పటికే ట్రయల్ రన్స్ విజయవంతంగా పూర్తయ్యాయి.

**సీఎం పర్యటన వివరాలు** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 11.30 గంటలకు జొన్నగిరికి చేరుకోనున్నారు. ఉదయం 11.45 గంటలకు గోల్డ్ మైనింగ్ ప్లాంట్ తొలి యూనిట్‌ను ప్రారంభించి, అనంతరం రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 12.20 గంటలకు జొన్నగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు పత్తికొండ నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. రాయలసీమ అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర పారిశ్రామిక రంగానికి, స్థానిక ఉపాధికి, ప్రభుత్వ ఆదాయానికి గణనీయమైన ఊతం లభించనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రైతులకు సబ్సిడీ వేరుశెనగ విత్తన కాయల పంపిణీ



**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి 23:**–లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతల రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై వేరుశెనగ విత్తన కాయలను తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలిరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, రైతులపై వ్యవసాయ పెట్టుబడి భారం తగ్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాయితీపై నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నదని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతుల సంక్షేమమే లక్ష్యంగా వివిధ పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు మాజీ సర్పంచ్ వెంకటరమణ, గంగాల శ్రీనివాసులు, వైస్ వెంకటరమణ, ఓబుల్ రెడ్డి, కుడుముల వెంకటరెడ్డి, జొన్న శ్రీనివాసులు, నాగశివయ్య, రామచంద్ర, పిడతల భాస్కర్, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆరిఫ్, హాస్పిటల్ కమిటీ సభ్యుడు వెంకటరామరాజు, టీడీపీ సీనియర్ నాయకుడు బడుగు వాసు, మాజీ ఎంపీటీసీ రాజేంద్రరెడ్డి, జేకే టైలర్, చిర్ల సుధాకర్ యాదవ్, గురుమూర్తి, మాజీ డీలర్లు వెంకటేష్, రామయ్య, బడుగు జగన్, మల్లికార్జున, రాజా, సురేంద్రతో పాటు పలువురు రైతులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174